

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -182 | పేజీలు - 8 | వెల - 03/- | ఆదివారం 11 అక్టోబర్ 2026

బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించిన మంత్రివర్గం

వార్డు సభ్యులకు పంచాయతీ యూనిట్‌గా రిజర్వేషన్ శాతం

జడ్పీ/ మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్‌కు రాష్ట్రం యూనిట్

సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా నిర్ణయం

కమిషన్ సిఫారసుల ప్రకారం బీసీ కోటా ఇలా..

గ్రామ వార్డు సభ్యులు: 26.73 శాతం

సర్పంచ్‌లు: 27.95 శాతం

ఎంపీటీసీలు: 25.55 శాతం

ఎంపీపీలు, జడ్పీటీసీలు: 24.6 శాతం

జడ్పీ చైర్‌పర్సన్‌లు: 23.08 శాతం

మున్సిపల్ వార్డులు:32.78 శాతం

మున్సిపల్ చైర్‌పర్సన్‌లు: 33.02 శాతం, మేయర్‌కు 35.29 శాతం



అమరావతి,అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక ఎన్నికలు వెంటనే నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం... శనివారం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించడంతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చింది.

గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, మిగతాది 2లో...



అట్టుడికిన ఢిల్లీ

మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్

అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు

కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం

న్యూ ఢిల్లీ అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీమిగతాది 2లో...



నిర్బంధాలకు భయపడబోం

ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ

తమిళనాడు సీఎం విజయ్‌తో రాహుల్ గాంధీ భేటీ

అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల మిగతాది 2లో...



పట్టిసీమ..జలభరోసా

చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు

అమరావతి,అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు..మిగతాది 2లో...



ఓడిపోతే ఈవీఎంలను నిందించడమా

ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు

ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ



అమరావతి,అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. మిగతాది 2లో...

పంటల రక్షణకు గ్రామ కమిటీలు

ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా సమగ్ర కార్యాచరణకు ఆదేశం

అక్టోబర్ 12న అనధికారిక కేబినెట్ భేటీ ఏర్పాటు

కరువు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్ అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగామిగతాది 2లో...

జగన్‌కు ఈడీ షాక్



అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్

రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన

దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు

విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

హైదరాబాద్ అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. మిగతాది 2లో...

యువకులను బలిగొన్న అలలు

ప్రకాశం జిల్లా పాకాల బీచ్‌లో పలువురు యువకులు గల్లంతై మృతి

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం



మిగతా2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

అట్టుడికిన ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు.ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు.జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు.ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

అభిజీత్ దిప్కే ఇంట విషాదం

దీర్ఘకాలిక అనారోగ్యంతో మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో మృతి

నిరసన తెలిపేందుకు ఢిల్లీ వెళ్లిన అభిజీత్ అరెస్టు

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన నాయనమ్మ ఈరోజు మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో కన్నుమూశారు. అదే సమయంలో అభిజీత్ దిల్లీలో పోలీసుల అదుపులో ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈ కష్ట సమయంలో కుటుంబంతో ఉండేందుకు ఆయనకు పోలీసులు అనుమతి ఇస్తారా లేదా అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.
వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా



సంతుక్ పింప్రి గ్రామంలో నివసిస్తున్న అభిజీత్ నాయనమ్మ (తండ్రి భగవాన్ దిప్కే తల్లి) గత కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యం, వయసురీత్యా సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం ఆమె ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసే సమయానికి అభిజీత్ దిల్లీలో పోలీసుల నిర్బంధంలో ఉన్నారు.ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. ఇందులో పాల్గొనేందుకు అభిజీత్, మరో ఇద్దరు పార్టీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలతో కలిసి ముంబై నుంచి దిల్లీకి విమానంలో బయలుదేరారు. అయితే, విమానం ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన వెంటనే, దిల్లీ పోలీసులు విమానంలోకి ప్రవేశించి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు.

పంటల రక్షణకు గ్రామ కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.
ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీని తర్వాత రైతులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.
ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దాదాపు 235 మండలాల్లో కరవు ఛాయలు అలముకున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ సబ్-కమిటీ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సలహాలు కూడా తీసుకోనున్నారు.

నిర్బంధాలకు భయపడబోం

(మొదటి పేజీ తరువాయి)


పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు.గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.
"మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు.ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.
తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్.. వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమస్వయానికి అద్దం పట్టింది.
శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది.

14న మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్

19న మండల, జడ్పీ ఎన్నికల షెడ్యూల్

వచ్చే నెలలో పంచాయతీ పోరు 3 దశల్లో నిర్వహణకు కసరత్తు

13న గుర్తింపు పొందిన 20 రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం



రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శనివారం క్యాబినెట్ ప్రత్యేకంగా సమావేశమైంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు నిర్ధారించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటైన స్వతంత్ర కమిషన్ చేసిన సిఫారసులను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామాల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్‌పర్సన్లు, మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల వరకూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. మరోవైపు ఈ నెల 13న రాష్ట్రంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశమై స్థానిక ఎన్నికల నిర్వహణపై చర్చించనుంది. ఈ భేటీ అనంతరం 14న మున్సిపల్, 19న ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్‌తో పాటు షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నవంబరులో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల సంఘం సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 13న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమైన అనంతరం 14న మున్సిపల్ ఎన్నికలకు, 19న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ నెలాఖరు నాటికి మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియను ముగించాలని నిర్ణయించింది. అలాగే నవంబరు 10 నుంచి 15వ తేదీ మధ్యలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల కానుంది. పంచాయతీలకు మూడు రోజుల వ్యవధిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. నవంబరు చివరి నాటికి మొత్తం పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. డిసెంబరు మొదటి నుంచి రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు కొత్త పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి.ఈ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో దాదాపు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, ఇతర అంశాలపై వివరించేందుకు 13న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశానికి ఆహ్వానించింది. విజయవాడలోని ఎస్ఈసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో 20 పార్టీలకు గుర్తింపు ఉండటంతో ఆయా పార్టీల అధినేతలకు ఆహ్వానపత్రాలను ఎస్ఈసీ అందించింది. పార్టీ అధ్యక్షులు లేదా పార్టీ గుర్తించిన ప్రతినిధులు సమావేశంలో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించింది.

జగన్‌కు ఈడీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది. కేసులు పదేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయంటేనే వాటిల్లో సహేతుకమైన పురోగతి లేదని స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంది. ఈ కేసులకు సంబంధించి తదుపరి దర్యాప్తు ఇంకా పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. కాగా.. ఈడీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 7న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ, జస్టిస్ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. జగన్ కేసులను త్వరగా తేల్చాలని గతంలోనూ పలు పిటిషన్లు దాఖలైనట్లు హైకోర్టు గుర్తించింది. మాజీ మంత్రి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేపట్టడానికి హైకోర్టు సుమోటోగా ఒక పిటిషన్‌ను నమోదు చేసింది.సదరు పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. జగన్ కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని.. ఈ మేరకు నివేదిక సమర్పించాలని 2024లోనే సీబీఐ ప్రత్యేక కోర్టుకు ఆదేశాలు జారీచేసినట్లుతాజా విచారణలో దర్యాసనం గుర్తించింది. ఈ రెండు పిటిషన్లు తర్వాత విచారణకు లిస్ట్ కాలేదని.. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఆ రెండు పిటిషన్లతో జత చేయాలని ధర్మాసనం రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది.

ఓడిపోతే ఈవీఎంలను నిందించడమా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. "రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

యువకులను బలిగొన్న అలలు

ప్రకాశం జిల్లా పాకాల బీచ్‌లో పలువురు యువకులు గల్లంతై మృతి

ప్రకాశం ,అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ మండలం పాకాల బీచ్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సముద్ర స్నానానికి దిగి పలువురు యువకులు మృతిచెందడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన చెందారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు.
ఈ దురదృష్టకర ఘటనపై స్పందించిన మంత్రి లోకేశ్, గల్లంతైన వారి ఆచూకీ కోసం అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను తక్షణమే ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.ప్రస్తుతం పాకాల బీచ్ వద్ద అధికారులు, స్థానిక మత్స్యకారుల సహకారంతో గల్లంతైన మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో పాకాల తీరంలో, మృతుల గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

పట్టిసీమ..జలభరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు.రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు.పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ సహా ఎనిమిది కేటగిరీల్లో రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభా 5,27,46,589 కాగా, అందులో బీసీలు 2,65,94,418 (50.42 శాతం)గా కమిషన్ తేల్చింది. గ్రామీణ జనాభాలో 48.84శాతం, పట్టణ జనాభాలో 54.36శాతం బీసీలు ఉన్నారని పేర్కొంది.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి స్థానిక సంస్థకు బీసీ రిజర్వేషన్లపై వేర్వేరుగా సిఫారసులు చేశారు. వార్డు సభ్యులకు రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించేందుకు గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకుంటారు. సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లను జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్/ మేయర్ రిజర్వేషన్లను రాష్ట్రం యూనిట్‌గా నిర్ణయిస్తారు. మున్సిపల్ వార్డు సభ్యులకు మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పొరేషన్ యూనిట్‌గా తీసుకుంటారు. సంబంధిత యూనిట్‌లోని మొత్తం జనాభాలో ఆయా వర్గాల నిష్పత్తి ప్రాతిపదికన తొలుత ఎస్టీలు, అ తర్వాత ఎస్సీలకు సీట్లు కేటాయిస్తారు.ఏ ప్రాంతంలో అయినా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎక్కువగా ఉంటే, మొత్తం పరిమితి 50 శాతానికి మించకుండా బీసీ రిజర్వేషన్లను దానికి అనుగుణంగా మారుస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు, షెడ్యూల్డ్ తండాలతో పాటు ఎస్సీ, ఎస్టీ జనాభా కలిపి 50 శాతం కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లకు అవకాశం లేని యూనిట్లకు ఈ లెక్కల నుంచి మినహాయిస్తారు.స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది. రిజర్వేషన్ల అమల్లో రాజ్యాంగ నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే స్థానాలను వారి జనాభా నిష్పత్తి ఆధారంగా నిర్ణయించాలని పేర్కొంది. పంచాయతీలకు సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డీ, మున్సిపాలిటీలకు సంబంధించి ఆర్టికల్ 243టీ నిబంధనలను అనుసరించాలని స్పష్టం చేసింది. కమిషన్ సిఫారసుల అమలుకు తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

లక్ష్మీపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్..

672 మద్యం బాటిళ్లు స్వాధీనం -ముగ్గురు అరెస్ట్.. స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 10)
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేసింది. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 672 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేశారు.





కర్నూలు డీఎస్పీ కె. రాఘవేంద్ర పర్యవేక్షణలో, కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఉలిందకొండ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, కె. నాగలాపురం ఎస్ఐ అఖిల్, సర్కిల్ పోలీసు సిబ్బంది, శిక్షణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్లు, ఇతర సమస్యాత్మక వ్యక్తులకు సంబంధించిన ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరుకలి శేఖర్ వద్ద 144 మద్యం బాటిళ్లు, ఏరుకలి తిమ్మయ్య వద్ద 384 బాటిళ్లు, ఏరుకలి సురేష్ వద్ద 144 బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 672 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, సంబంధిత ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడం, అక్రమ కార్యకలాపాలను నియంత్రించడం, ప్రజలకు భద్రత కల్పించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని పోలీసులు పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

ఆళ్లగడ్డ పట్టణంలో రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం





ఆళ్లగడ్డ అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ పట్టణం లోని ఎంవీ నగర్, వీవర్స్ కాలనీలో సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంవీ నగర్, వీవర్స్ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం ఉదయం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఆమె స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడుతూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

కర్నూలు జిల్లాలో మరో రెండు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ.. - ఒక్కో దుకాణానికి రూ.3 లక్షల దరఖాస్తు రుసుము

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 10)
కర్నూలు జిల్లాలో మిగిలిన రెండు మద్యం దుకాణాల కేటాయింపునకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జనరల్ కేటగిరీ కింద కర్నూలు, ఎమ్మిగనూరు రూరల్ పరిధిలోని రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ జిల్లా కలెక్టర్ అనుమతితో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చ సుధీర్‌బాబు తెలిపారు.జిల్లాలో తొలుత రెన్యువల్ ప్రక్రియ ద్వారా 92 దుకాణాలు, మొదటి విడతలో కొత్త దరఖాస్తుల ద్వారా 15 దుకాణాలు కలిపి మొత్తం 107 మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, తాజాగా మరో రెండు దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించారు.



దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు
నోటిఫికేషన్ ప్రకారం ఒక్కో మద్యం దుకాణానికి వార్షిక లైసెన్సు ఫీజు రూ.71.50 లక్షలు, పర్మిట్ రూమ్ ఫీజు రూ.7.50 లక్షలుగా నిర్ణయించారు. ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుము చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు రావాల్సి ఉంటుందని తెలిపారు.

19వ తేదీ అర్ధరాత్రి వరకు గడువు
ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 10వ తేదీ నుంచి 19వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు సమర్పించవచ్చని అధికారులు వెల్లడించారు.దరఖాస్తుల పరిశీలన అనంతరం అక్టోబర్ 21వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ విధానం ద్వారా దుకాణాల ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు.

మరిన్ని వివరాలకు సంప్రదించండి
దరఖాస్తు ప్రక్రియ, నిబంధనలు, ఇతర వివరాల కోసం ఆసక్తి గల వారు కర్నూలు, ఎమ్మిగనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లతో పాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని సూపరింటెండెంట్ మచ్చ సుధీర్‌బాబు సూచించారు.

గఫూర్ కుటుంబానికి కాటసాని పరామర్శ..
పీవీ కిరణ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి!



కర్నూలు ప్రతినిధి, అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్):
కర్నూలు మాజీ ఎమ్మెల్యే యంవీ. గఫూర్ కుమారుడు పీవీ కిరణ్ అమెరికాలో గుండెపోటుతో మృతి చెందారన్న విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కర్నూలులోని గఫూర్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీవీ కిరణ్ అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాటసాని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో గఫూర్ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

69 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

తనపై రాజకీయ కుట్రతోనే అక్రమ కేసులు నమోదు చేశారని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపణ







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 10)
ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఆయన సోదరుడు శ్రీరాములు, కుమారుడు చంద్రశేఖర్‌తో పాటు మరో 25 మంది 69 రోజుల అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు సబ్‌జైలు వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.రాష్ట్రంలో చంద్రబాబు పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తోందని, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే విరుపాక్షిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు.టీడీపీ నేతకు చెందిన కుటుంబంలో జరిగిన ఘటనను సాకుగా చూపి, గత ఆగస్టు 1న చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం, వాహనాలపై దాడికి సంబంధించిన మూడు కేసులు నమోదు చేయడం అన్యాయమని ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేను అరెస్టు చేయాలనే ఉద్దేశంతోనే కేసులు పెట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే సోదరుడు, కుమారుడిని సైతం కేసుల్లో ఇరికించారని అన్నారు.
సంబంధిత ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వ వ్యవహారశైలి ప్రజలకు తెలిసిందని పేర్కొన్నారు. 69 రోజుల అనంతరం ఎమ్మెల్యే బెయిల్‌పై విడుదల కావడం నేపథ్యంలోనైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను నిలిపివేయాలని కోరారు. పోలీసు శాఖ టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసులపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

రాజకీయ కుట్ర జరిగింది: ఎమ్మెల్యే విరుపాక్షి
తనపై చంద్రబాబు, నారా లోకేశ్ రాజకీయ కుట్రకు పాల్పడి అక్రమ కేసులు నమోదు చేయించారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. పార్టీ కార్యకర్తను పరామర్శించేందుకు వెళ్లిన తనను పోలీసులు నిర్బంధించి జైలుకు పంపించారని విమర్శించారు.ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠ జ్యోతి దళితులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించిన ఎమ్మెల్యే, టీడీపీ నేత కుటుంబానికి సంబంధించిన ఘటనలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రచారంలో ఉన్న వీడియో వాస్తవాలను ప్రజలు గమనించారని అన్నారు.డీఐజీ కోయ ప్రవీణ్, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి, మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విరుపాక్షి ఆరోపించారు. ఈ కారణంగానే తాను 69 రోజుల పాటు జైలులో ఉండాల్సి వచ్చిందని పేర్కొన్నారు.వాల్మీకి సామాజిక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి, ఆ వర్గాన్ని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని చంద్రబాబుపై విమర్శలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వాల్మీకి సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశాలు కల్పించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు.తనపై, తన కుటుంబ సభ్యులపై కేసుల విషయంలో న్యాయం కోసం పోరాడుతామని ఎమ్మెల్యే విరుపాక్షి స్పష్టం చేశారు.

నకిలీ విత్తనాలతో రైతులకు కన్నీళ్లు..

న్యాయం చేయాలని కాటసానిని ఆశ్రయించిన పాలకొలను రైతులు!

మొలకెత్తని కుసుమ విత్తనాలతో తీవ్ర నష్టం.. సంబంధిత వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి





ఓర్వకల్లు ప్రతినిధి, అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్):నకిలీ కుసుమ విత్తనాలతో నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన రైతులు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డిని కలిశారు. నందికొట్కూరుకు చెందిన ఓ విత్తనాల వ్యాపారి పాలకొలను గ్రామానికి వచ్చి రైతులకు కుసుమ విత్తనాలు విక్రయించారని, వాటిని పొలాల్లో విత్తిన తర్వాత మొలకెత్తకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై సంబంధిత వ్యాపారిని సంప్రదించినప్పటికీ సరైన స్పందన లేదని రైతులు తెలిపారు. వ్యవసాయంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టిన తమకు విత్తనాల వైఫల్యంతో ఆర్థిక నష్టం వాటిల్లిందని, దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కాటసాని రామభూపాల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ సెక్రటరీ పాలకొలను రమేష్, రైతులు నర్రా లాజర్, షేక్ ఇష్మాల్, కురువ నాగేశ్వరరావు, కురువ జయరాముడు, ఆవుల మద్దయ్య, మహబూబ్ భాష, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటసాని రామభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా కేపీఎల్ సీజన్1 క్రికెట్ పోటీలు ప్రారంభం!

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.. క్రీడలతోనే క్రమ-శిక్షణ, ఐకమత్యం



కల్లూరు ప్రతినిధి, అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్):కర్నూలులోని జోహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ కళాశాల మైదానంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న లైట్ టెన్నిస్ క్రికెట్ లీగ్ కేపీఎల్ సీజన్1 పోటీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కల్లూరు అర్బన్ 33వ వార్డు ఆధ్వర్యంలో పాలకొలను రమేష్, రెడ్డిపోగు అంజి నేతృత్వంలో ఈ పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీల్లో పాల్గొంటున్న జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పోటీలు స్థానిక క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కల్లూరు అర్బన్ 33వ వార్డు మాజీ కార్పొరేటర్ మైతపు నరసింహులు, 32వ వార్డు మాజీ కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, తిరుపాలు, నిర్వాహకులు పాలకొలను రమేష్, రెడ్డిపోగు అంజి తదితరులు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలైన మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డికి ఘన స్వాగతం

చిప్పగిరి, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్)ఆదోని జైలు నుంచి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షితో పాటు అరెస్టయిన చిప్పగిరి మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి శనివారం విడుదలయ్యారు. ఆయన విడుదల వార్తతో చిప్పగిరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. జైలు నుంచి విడుదలై వచ్చిన సురేష్ రెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు సురేష్ రెడ్డిని ఆప్యాయంగా కలిసి పరామర్శించారు. ఆయన విడుదల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపారు. తమ నాయకుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చాలాకాలం తర్వాత ఆయనను కలుసుకున్న అభిమానులు ఉత్సాహంగా స్వాగతం పలకడంతో అక్కడ సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, చెరువు మహానంది, రోషప్ప, సుధా, వినోద్, గోవింద్ రెడ్డి, అప్పన్న, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు. సురేష్ రెడ్డి విడుదల సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ మద్దతును తెలియజేశారు.



అవుకు బస్టాండ్ సమీపంలో రోడ్డు ప్రమాదం

అవుకు అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్
నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అవుకు పట్టణానికి చెందిన కట్టెల రాము అనే వ్యక్తికి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అవుకు బస్టాండ్ మలుపు వద్ద కట్టెల రాము రోడ్డు దాటుతున్న సమయంలో కొలిమిగుండ్లకు చెందిన స్కార్పియో వాహనం ఎదురుగా వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో రాము కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన రామును అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

మద్యం దుకాణాలు గెజిట్ సంబంధిత వివరాలు

నంద్యాల క్రైం, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల జిల్లాలో మద్యం దుకాణాల రెన్యూవల్ గడువు ముగిసిన నేపథ్యంలో, కొన్ని సాంకేతిక కారణాల వల్ల, ఆన్‌లైన్ లావాదేవీలలో తలెత్తిన ఇబ్బందుల వల్ల మిగిలిపోయిన దుకాణాల కోసం శనివారం గెజిట్ విడుదల చేయడం జరుగుతోందని నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి తెలిపారు.

ముఖ్యమైన వివరాలు

ఓపెన్ కేటగిరీ మద్యం దుకాణాలకు గెజిట్ నంబర్:155 ద్వారా దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నామని పేర్కొన్నారు.

మద్యం దుకాణాల వివరాలు

సిరివెళ్ల మండలం – 1, ఆళ్లగడ్డ రూరల్ – 1, బేతంచెర్ల రూరల్ – 1, నందికొట్కూరు రూరల్ – 1, ఆత్మకూరు మున్సిపాలిటీ – 1, ఆత్మకూరు మండలం రూరల్ – 1, కొత్తపల్లి మండలం – 1 మొత్తం: 7 ఉన్నాయి.

గౌడ కులస్తులకు కేటాయించిన షాపు వివరాలు

పగిడ్యాల మండలంలో జనరల్ కులస్తులకు ఉన్న దాంట్లో సగం లైసెన్స్ ఫీజుతో, గౌడ కులస్తుల కోసం ఒక షాపు కేటాయించబడింది. దీనికి సంబంధించిన గెజిట్ నంబర్: 156. ద్వారా దరఖాస్తులుఆహ్వానించబడుతున్నామని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం, గడువు:

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మోడ్‌లలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఈ దరఖాస్తులను ఈ నెల 19వ తారీఖు అర్ధరాత్రి 12:00 గంటల వరకు ఎలాంటి నిరభ్యంతరంగా వేసుకోవచ్చును. రాజకీయ లేదా ఇతర ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించడం జరిగింది. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే మీ సమీపంలోని స్టేషన్‌కు లేదా నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి తగిన ఆధారాలతో తెలుసుకోవచ్చు.

డ్రా వివరాలు:

21వ తారీఖు ఉదయం 8:00 గంటలకు పూర్తిగా పారదర్శక విధానంతో కలెక్టర్ స్వహస్తాలతో ఈ డ్రా తీయబడుతుంది.మీకు ఈ సమాచారంలో ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలోను లేదా నంద్యాల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ లలోనూ వివరాలు తెలుసుకోవచ్చు అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి







నంద్యాల బ్యూరో, అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ డైరెక్టర్ ప్రశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి దశలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం బనగానపల్లె, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆమె పర్యటించి, ఓటర్ల జాబితాకు సంబంధించి అందిన ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులతో పాటు వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దరఖాస్తుల వివరాలు, వాటి ధ్రువీకరణకు సంబంధించిన ఆధారాలు, రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దరఖాస్తుల స్వీకరణ నుంచి పరిశీలన, ధ్రువీకరణ, పరిష్కారం వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను అందుబాటులో ఉన్న ఆధారాలతో సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత విధానాలను అనుసరించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణలో గుర్తించిన లోటుపాట్లను తక్షణమే సరిదిద్దాలని, సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రశాంతి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత ఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 10)

త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.కర్నూలు నగర శివార్లలోని అథేనా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, సిబ్బంది రాకపోకలు, రిసెప్షన్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల సామగ్రిని భద్రపరచడం, పంపిణీ చేయడం వంటి ప్రక్రియల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమన్వయంతో, ముందస్తు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వర్తించి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

-యువత నషా ముక్త భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి







నంద్యాల బ్యూరో, అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. మేరా యువ భారత్, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నంద్యాల బ్లాక్ స్థాయిలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ జి ఎం ఇంజనీరింగ్ కాలేజీ)లో "నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ నషా ముక్త యువ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తులుగా నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం కోఆర్డినేటర్ డాక్టర్ డి. లెనిన్, శ్రీ వెంకటేశ్వర రెడ్డి, నంద్యాల జిల్లా యువజన అధికారి శ్రీ టి. ఇసయ్య పాల్గొని యువతకు అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి టి. ఇసయ్య మాట్లాడుతూ, మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను, మై భారత్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ యువజన కార్యక్రమాలను వివరించారు. యువత ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సామాజిక సేవలో ముందుండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను వివరించారు. వ్యసనాల కారణంగా కుటుంబాల్లో ఏర్పడే సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సంబంధాలపై పడే ప్రతికూల ప్రభావాలను వివరిస్తూ, యువత బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజం ఎదుర్కొనే సమస్యలను వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, నేరాలకు పాల్పడినప్పుడు ఎదురయ్యే శిక్షలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు, మాదకద్రవ్యాల అక్రమ వినియోగం మరియు సంబంధిత కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డాక్టర్ డి. లెనిన్, ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం కోఆర్డినేటర్, విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని ప్రోత్సహించారు. వెంకటేశ్వర రెడ్డి యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించి, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యసనాల నివారణ, యువత బాధ్యత, కుటుంబాలు మరియు సమాజంపై మాదకద్రవ్యాల ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు బానిసైన వారిని చిన్నచూపు చూడకుండా, వారికి తగిన చికిత్స మరియు పునరావాసం పొందేందుకు సహకరించాలని సూచించారు.

అనంతరం పాల్గొన్న యువత "నషా ముక్త యువ" ప్రతిజ్ఞ చేసి, తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తోటి యువతకు అవగాహన కల్పిస్తామని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని సంకల్పించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మేరా యువ భారత్ నంద్యాల జిల్లా నిర్వాహకులు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రతపై ప్రత్యేక దృష్టి

19 కీలక అంశాలకు నోడల్ అధికారుల నియామకం

484 గ్రామ పంచాయతీ సర్పంచులు, 5,100 వార్డు సభ్యులకు ఎన్నికలు





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 10)

త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రత తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురపాలక, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

ఎన్నికల సామగ్రి, కేంద్రాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ముందుగానే గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అదనంగా కల్పించాల్సిన వసతులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీతో పాటు ఇతర ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకోవాలని, రిజర్వ్ బ్యాలెట్ బాక్సుల కేటాయింపు, భద్రత, పంపిణీ, పోలింగ్ అనంతరం తిరిగి స్వీకరణకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.పోలింగ్ పార్టీల రాకపోకలకు అవసరమైన రవాణా ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని గుర్తించి బాధ్యతలు కేటాయించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించి, పోలింగ్ ప్రక్రియ, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని, రోజువారీ నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

19 అంశాలకు నోడల్ అధికారులు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి 19 కీలక అంశాల పర్యవేక్షణ కోసం నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, కాలపట్టిక రూపొందించుకొని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు.బ్యాలెట్ బాక్సుల సమీకరణ, కేటాయింపు, పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఎన్నికల సిబ్బంది నియామకం, ఎన్నికల సామగ్రి నిర్వహణ, శిక్షణ, స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, రవాణా, రోజువారీ నివేదికలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సున్నిత, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, పరిస్థితులకు అనుగుణంగా అదనపు భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు.

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పోలింగ్, బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, ఓట్ల లెక్కింపు, ఎన్నికల అనంతర ప్రక్రియలు పూర్తయ్యే వరకు నోడల్ అధికారులు తమ బాధ్యతలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

484 గ్రామ పంచాయతీ సర్పంచులు, 5,100 వార్డు సభ్యులకు ఎన్నికలు

జిల్లాలో 484 గ్రామ పంచాయతీ సర్పంచులు, 5,100 వార్డు సభ్యులతో పాటు 26 జడ్పీటీసీ, 432 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి కూడా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జడ్పీ సీఈవో, డీపీవోలను ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

నామినేషన్లపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క అంకె ఓట్ల తేడాతో కూడా ఫలితాలు మారే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, సంబంధిత నిబంధనలపై అభ్యర్థులకు ముందుగానే అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్లకు తెలిపారు.కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీవో భాస్కర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ఎవరు అడ్డొచ్చినా రిజర్వేషన్లు కల్పిస్తాం

బీసీలు ఎదుకూడదన్నదే వైసీపీ ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

స్థల వివాదంలోకి తనను లాగడం పై దగ్గుపాటి ఆగ్రహం

ఇదంతా మా పార్టీ కోవర్టులు, వైసీపీ వారి పనే

నగరంలో 62కి 62స్థానాలు గెలుస్తామన్న దగ్గుపాటి

మేయర్ అభ్యర్థిని నిర్ణయించేది అధిష్టానమే.. ఎమ్మెల్యే



అనంతపురం సంక్షేమం, అక్టోబర్ 10,(రిపబ్లిక్ న్యూస్):

ఎవరు అడ్డుకున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం గారు చేశారు. రామ్ నగర్ అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీలకు మొదటి నుంచి ద్రోహం చేసింది వైసీపీనే

బీసీలకు మొదటి నుంచి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. గతంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. ఆరోజు ఎన్టీఆర్ .. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అనేక మంది బీసీ నేతలకు ఉన్నత పదవులు దక్కాయన్నారు. బీసీలకు మొదటి నుంచి ద్రోహం చేసింది వైసీపీనేనని.. కేవలం అధికారం తన వర్గానికే ఉండాలనేది జగన్ ఆలోచనన్నారు. గతంలో శంకర్ నారాయణ లాంటి వారు మంత్రిగా ఉన్నప్పటికీ, వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా జగన్ రెడ్డి అణచివేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు రాకుండా హైకోర్టులో, ఆపై సుప్రీం కోర్టులో జగన్ మోకాలడ్డారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదన్నదే జగన్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదన్నారు. జగన్ కేవలం ముగ్గురిని మాత్రమే దగ్గర పెట్టుకుని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా దూరం పెట్టారన్నారు.

రైజింగ్ రాయలసీమగా మన ప్రాంతం దూసుకుపోతోంది

రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం మరియు పీపీపీ మోడల్‌లో మరో రూ. 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క డ్రిప్ లేదా స్ప్రింక్లర్ కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 300 కోట్లతో డ్రిప్పులు, స్ప్రింకర్లను రైతులకు అందించామన్నారు. రాయలసీమ ప్రాంతానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రసిద్ధ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామన్నారు. అలాగే వేల కోట్ల పెట్టుబడులతో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. పుట్టపర్తికి యుద్ధ విమానాలు తయారు చేసే డిఫెన్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అనంతపురం జిల్లాలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కియా మోటార్స్ తెచ్చి 50వేల మందికి ఉద్యోగ,ఉపాధి కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సంక్షేమ పథకాల్లో పోటీ లేదు

ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఏకంగా రూ. 10,400 కోట్లు జమ చేశారన్నారు. రెండవ విడుత కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించగా, ఇప్పటివరకు 10 కోట్ల ప్రయాణాలు విజయవంతంగా జరిగాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వృద్ధులు, వికలాంగులకు భారీగా పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్ల సేవ, చేనేత కార్మికులకు విద్యుత్ సబ్సిడీ, నేతన్న సేవ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జగన్ గతంలో అన్న క్యాంటీన్లను మూసివేసి పైశాచిక ఆనందం పొందారని విమర్శలు చేశారు. మా ప్రభుత్వం వచ్చాక పేదల ఆకలి తీర్చడానికి 275 అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి.. 5రూపాయలకే 3పూటల భోజనం అందిస్తున్నామన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2వేలకోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ రెండేళ్లలో చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మౌలిక వసతుల కోసం రూ. 300 కోట్లు ఖర్చు చేశామని... మేము చేసిన అభివృద్ధి వల్లే నేడు రాంనగర్ ప్రాంతంలో సెంట్ భూమి విలువ రూ. 20 లక్షల నుండి రూ. 40 లక్షలకు చేరిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తను పూర్తి స్థాయిలో తొలగించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగిలిన 25 శాతం పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో ఇక్కడ సరికొత్త 'ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్' తీసుకురాబోతున్నామని.. మిగిలిన స్థలంలో ప్రజల కోసం అందమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. గత నెలలోనే అమృత్-2 ద్వారా రూ. 107 కోట్లతో నియోజకవర్గంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయబోతున్నామని.. రూ. 50 కోట్లతో నగరంలో పార్కులు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా మరో రూ. 160 కోట్లతో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

.

అభివృద్ధిని ఓర్వలేకనే ఈ చిల్లర రాజకీయాలు

గత రెండేళ్లుగా తనపై కుట్రలు, బురదజల్లే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఉనికి కోసం కొందరు నిరుద్యోగ నాయకులు, వైఎస్ఆర్సీపీ నేతలతో చేతులు కలిపి నాపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కర్నూలుకు చెందిన ఒక మహిళ వ్యక్తిగత స్థల వివాదాన్ని మంత్రి టి.జి. భరత్ నా దృష్టికి తీసుకురాగా, నేను తక్షణమే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని కోరానన్నారు. ఆమె ఆగస్టులో ఒక వ్యక్తికి స్థలం విక్రయించగా, సెప్టెంబర్ 29 నాటికి రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందన్నారు. అయితే ఈ ప్రక్రియ కాస్త ఆలస్యం కావడంతో మా పార్టీలోని కొందరు కోవర్టులు ఆమెను రెచ్చగొట్టారన్నారు. సదరు మహిళను కర్నూలు నుండి అనంతపురం తీసుకొచ్చి.. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తే పని త్వరగా అవుతుందని పూర్తిగా స్క్రిప్ట్ ఇచ్చి మోటివేట్ చేశారన్నారు. దీని వెనుక మా పార్టీలోని కొందరు కోవర్టులతో పాటు వైసీపీ నాయకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ వివాదానికి ఇప్పటికే పూర్తి పరిష్కారం లభించిందని..శుక్రవారమే ఆ మహిళకు సదరు స్థలం రిజిస్ట్రేషన్ కూడా చేయించారన్నారు. లీకైనట్లు చెప్తున్న ఆడియోలో ఎలాంటి అభ్యంతరకర విషయాలు లేవని పైగా నన్నిఏదో విషయంలో ఇరికించాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నా ఎదుగుదలను, నియోజకవర్గ అభివృద్ధిని ఓర్వలేకనే ఈ చిల్లర రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. ఈ మొత్తం విషయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని.. ఇందులో ఎవరున్నా చర్యలు తప్పవన్నారు. గత రెండేళ్లుగా నాపై బురద జల్లాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహా కొందరు రాజకీయ నిరుద్యోగులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలన్నారు. రాజకీయంగా ఉనికి కోల్పోతూ, రాత్రి నిద్రలో కూడా నన్నే కలవరిస్తున్నారన్నారు. ద

సామాన్య కార్యకర్తకి ఇచ్చిన వారి గెలుపు కోసం పని చేస్తా

రుద్రంపేటలోని ఎస్సీల స్థల వివాదాన్ని, అలాగే వైసీపీకి చెందిన బీసీ వ్యక్తి, మైనార్టీ మహిళకు సంబంధించిన ఆస్రా ఆసుపత్రి వివాదాన్ని కూడా నాకే ఆపాదించి దుష్ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నాకు దగ్గరగా ఉన్న వారిని ఏదో విధంగా దూరం చేస్తున్నారని.. అందులో భాగంగానే సుధాకర్ యాదవ్‌ను, అలాగే నా పక్కన ఉన్న వాళ్లను కావాలనే వివాదాల్లోకి లాగి నన్ను ఒంటరిని చేయాలని కుతంత్రాలు పన్నుతు న్నారన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు నేను భయపడే ప్రసక్తే లేదన్నారు. నాకు ప్రజలతో పాటు పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ గారి అండ ఉన్నంత వరకు ఏవరూ ఏమీ చేయలేరన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని 62కి 62 స్థానాలను గెలుచుకుని తీరుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చిన తర్వాత మేయర్ అభ్యర్థిపై స్పష్టత వస్తుందన్నారు. అధిష్టానం మేయర్ అభ్యర్థిగా ఒక సామాన్య కార్యకర్తకి ఇచ్చిన వారి గెలుపు కోసం పని చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు..

కీర్తనలతో ఆధ్యాత్మిక సందడి

ఘనంగా అంతర్రాష్ట్ర కన్నడ సాహిత్య సదస్సు

కోలాట ప్రదర్శనతో కన్నడ సంస్కృతికి నీరాజనం

డాక్టర్ దేవరకొండ కౌసల్యకు ఘన సన్మానం



అనంతపురం కల్చరల్,అక్టోబరు 10,(రిపబ్లిక్ న్యూస్):

కన్నడ సాహిత్య సౌరభం, భక్తి సంగీత మాధుర్యం,సంప్రదాయ కోలాట విన్యాసాలతో గీతా మందిరం సాంస్కృతిక వైభవానికి వేదికైంది. శ్రీ అంతర్రాష్ట్ర కన్నడ సాహిత్య సదస్సు సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. త్రివర్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పోటూరు హరికృష్ణ ఆదేశాల మేరకు ఓం సంగీత కోలాటం శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో చిన్నారులు భక్తి భావంతో ఆలపించిన పురంధరదాసు కీర్తనలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం పెద్దలు అదే కీర్తనలకు అనుగుణంగా కోలాటం ప్రదర్శిస్తూ కన్నడ సంప్రదాయ కళల గొప్పతనాన్ని చాటారు. సంగీతం, సాహిత్యం, జానపద కళల సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం సాంస్కృతిక సందడిని నింపింది. చిన్నారుల్లో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడం తోపాటు సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సోమశేఖర్ కార్యక్రమాల నిర్వహణలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ దేవరకొండ కౌసల్యను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులు, పెద్దలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రమ, శిరీష, రాగిణి, పద్మ, హేమ, శైలజ, ఈశ్వరి, పూజ, అనిత, లక్ష్మి, దీపిక, సమృద్ధి, సాధన, అమ్ము, అభిగ్న, శిల్ప తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాస్వామ్యంలో సమాన భాగస్వామ్యం కల్పించాలి

జిల్లా క్రైస్తవ నాయకుల సమావేశంలో తీర్మానం



అనంతపురం సంక్షేమం, అక్టోబరు 10,(రిపబ్లిక్ న్యూస్):

ప్రజాస్వామ్య వ్యవస్థలో క్రైస్తవ సమాజానికి సముచితమైన గుర్తింపు, గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. క్రైస్తవులను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా సమాజాభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించాలని తీర్మానించారు.రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రాచనాపల్లి యేసు కృపా మందిరంలో శనివారంక్రైస్తవ నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది క్రైస్తవులు, 1,200 మంది పాస్టర్లు ఉన్నారని, అనేక చర్చిల ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు.విద్య, వైద్యం, సంక్షేమం, సమాజాభివృద్ధిలో క్రైస్తవ సమాజం విశేషమైన కృషి చేస్తున్నప్పటికీ, స్థానిక సంస్థల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని నాయకులు అభిప్రాయపడింది. క్రైస్తవుల జనాభాను పరిగణనలోకి తీసుకొని, నిబంధనలకు అనుగుణంగా నామినేటెడ్ లేదా కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాలను కోరారు.స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల రూపకల్పనలో క్రైస్తవ నాయకులు, పాస్టర్లు, సంఘ ప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరారు.క్రైస్తవ అర్హులైన వ్యక్తులకు రాజకీయ పార్టీల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచితమైన అవకాశాలు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో క్రైస్తవుల మద్దతును కోరే రాజకీయ పార్టీలు, ఎన్నికల అనంతరం వారి హక్కులు, సమస్యలు, అభివృద్ధి అవసరాలపైనా దృష్టి సారించాలని సూచించారు.అందులో భాగంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన సమస్యలు, విద్యా, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, పేద క్రైస్తవ కుటుంబాల ఆర్థిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఆయా సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాలతో సమానంగా క్రైస్తవులకు గౌరవం, గుర్తింపు, అవకాశాలు లభించినప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిపూర్ణమవుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సేవారత్న పాస్టర్ రెడ్డి వారి నెహమ్యా నాగరాజు, కళ్యాణదుర్గం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ చెల్లా కిషోర్ చౌదరి, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు బిషప్ వై.పీ. బాబు, ఏఐపీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ మోజస్ అనిల్, జిల్లా అధ్యక్షులు బిషప్ డాక్టర్ జాన్సన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సాకే నరేష్ -రిజర్వేషన్లు, చట్టాలపై కూటమికి ప్రశ్న

బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తా -బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు



అనంతపురం సంక్షేమం, అక్టోబర్ 10,(రిపబ్లిక్ న్యూస్):

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాకే నరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సాకే నరేష్ ప్రశ్నించారు. బీసీలకు న్యాయం జరగాలంటే రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు, వారి హక్కులు, చట్టబద్ధమైన ప్రయోజనాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ సాకే నరేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా ఉద్యోగ అవకాశాలు, ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయో ప్రభుత్వం వివరించాలని కోరారు. చట్టాలు, రిజర్వేషన్ల పరిరక్షణ, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాల కల్పన వంటి అంశాల్లో బీసీలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీల సంక్షేమం మాటలకే పరిమితం కాకుండా, ఇచ్చిన హామీలను కార్యాచరణ ద్వారా నిరూపించాలని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం తమ సమితి నిరంతరం పోరాటం చేస్తుందని, బీసీలకు న్యాయం జరిగే వరకు తమ గళాన్ని వినిపిస్తామని డాక్టర్ సాకే నరేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు తోపు చంద్ర, రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రెగ్యులర్ డిప్యూటీ సీఈఓగా సమత నియామకం

ఎంపీడీఓలు, ఉద్యోగుల్లో హర్షం

అనంతపురం జెడ్పీ, అక్టోబర్ 10,(రిపబ్లిక్ న్యూస్):



ఇన్నాళ్లూ ఇన్‌చార్జి పాలనతో నెట్టుకొచ్చిన అనంతపురం జిల్లా పరిషత్‌కు ఎట్టకేలకు పూర్తిస్థాయి అధికారిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా రెగ్యులర్ డిప్యూటీ సీఈఓగా సమతను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆమెను తొలుత అదే జిల్లా డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులను రద్దు చేసి అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది.గతంలో డిప్యూటీ సీఈఓగా పనిచేసిన లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య కడప జిల్లా పులివెందులకు డీడీఓగా బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి రెగ్యులర్ అధికారిని నియమించకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలతోనే కార్యాలయాన్ని నెట్టుకొచ్చారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి నియామకంపై ఉమ్మడి జిల్లా ఎంపీడీఓల్లో అసంతృప్తి వ్యక్తమైనట్లు సమాచారం. పలువురు ఎంపీడీఓలు జెడ్పీ కార్యాలయానికి రావడానికే ఆసక్తి చూపలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.జిల్లా పరిషత్ పరిపాలనలో డిప్యూటీ సీఈఓ పోస్టు కీలకమైనది. ఎంపీడీఓలు, జెడ్పీ విభాగాల మధ్య సమన్వయం, పరిపాలనా వ్యవహారాల పర్యవేక్షణలో ఈ పోస్టుకు ప్రాధాన్యం ఉంటుంది. ఇలాంటి కీలక స్థానంలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పాలనా వ్యవహారాలపై ప్రభావం పడిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. తాజాగా సమత నియామకంతో పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థంగా పనిచేస్తుందని ఎంపీడీఓలు, జెడ్పీ ఉద్యోగులు ఆశిస్తున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ అధికారి నియామకం ఖరారు కావడంతో జిల్లా పరిషత్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

:-ప్రజా సంఘాల నాయకులు



పాములపాడు అక్టోబర్-10 రిపబ్లిక్ న్యూస్:- భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఏ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.స్వామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు లు అన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని పాములపాడు మండలంలోని, లింగాల గ్రామంలో దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.స్వామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ బిజెపి కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించి ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల 13 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయారని అన్నారు. భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది దాని విధి విధానాలను రూపొందించింది పాలక పార్టీలు అన్ని వ్యవస్థలను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నట్లే ఎన్నికల వ్యవస్థను కూడా అనేక సందర్భాల్లో దుర్వినియోగం చేశారని విమర్శించారు. స్వతంత్రంగా వివరించాల్సిన ఎన్నికల కమిషన్ సర్ పేరుతో బిజెపి జేబు సమస్తగా మారి అక్రమాలకు పాల్పడడం భారత రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. తక్షణమే భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, సర్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పండుగల సమయంలో కల్తీ అరికట్టాలి

రాష్ట్ర వినియోగదారుల రక్షణ సంఘం కార్యదర్శి విజయ్



ఆళ్లగడ్డ అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణం లోని మిఠాయిలు తయారు చేసే బేకరీలను పరిశీలించిన రాష్ట్ర వినియోగదారుల రక్షణ సంఘాల సమైక్య వ్యవహారిక కార్యదర్శి ఆర్టిస్ట్ విజయ్ ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ. రాబోయే దసరా మరియు దీపావళి పండగల సందర్భంగా దేశ వ్యాప్తంగా మిఠాయిలు, పానీయలు,పలాఉత్పత్తులు వినియోగించడం అధికంగా ఉంటుందని. ఇదే అదునుగా భావించి నకిలీ, కల్తీ, మరియు సురక్షితం కాని ఆహార పదార్థాలను అమ్మడానికి కొందరు అక్రమ వ్యాపారులు ప్రయత్నం చేస్తారని కావున ఇలాంటి అక్రమ వ్యాపారులపై ఆహార భద్రతధికారులు తగిన చర్యలు తక్షణమే తీసుకోవాలని విజయ్ కోరారు. అక్రమ విక్రయాలను అరికట్టడానికి పర్యవేక్షణ మరియు అమలు చర్యలు అధికారులు పెంచాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆదారిటీ అఫ్ ఇండియా అధికారులను కోరారు. పండుగల కాలమంతా నాణ్యమైన మరియు కల్తీలేని ఆహార పదార్థాలను వ్యాపారులు అందించేలా చూడాలని. అక్కిడికక్కడే వేగవంతమైన ఆహార పరీక్షలు నిర్వహించాలని డిసిగ్నేటెడ్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా స్థానికంగా వున్న బేకరీ తయారీ ని. తనిఖీ చేసి వారు వాడు తున్న నూనెలను ఇతర ఆహార పదార్థాలను పరిశీలించి. పరిశుభ్రత ను పాటించాలని, వాడిన నూనెను తిరిగి వాడొద్దని, కల్తీలకు పాల్పడవద్దని ఇందుకు విరుద్ధంగా తయారీలు జరిపితేఅట్టి వారిపై కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ సంఘాల సమైక్య వ్యవహారిక కార్యదర్శి విజయ్ వారిని హెచ్చరించారు.

చౌడేపల్లిలో ఘనంగా ఎస్ కే రమణారెడ్డి జన్మదిన వేడుకలు



చౌడేపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఎస్ కే రమణారెడ్డి జన్మదిన వేడుకలు చౌడేపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రమణారెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులు, నాయకులకు పంచిపెట్టారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే రమణారెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ప్రజా సేవలు చేయాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సోమల సురేష్ (రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి)శ్రీనివాసులు నాయుడు గారు (సోమల ఏఎంసీ చైర్మన్) ఆసూరి బాలాజీ (మాజీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు) షేక్ ఇబ్రహీం (అంజుమాన్ కమిటీ సెక్రటరీ)వీరితో పాటు పుంగనూరు నియోజకవర్గంలోని పలు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఎస్ కే రమణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

బోయకొండలో భక్తులను అలరించిన చండీ హోమం





చౌడేపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్

శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అమావాస్య పురస్కరించుకొని ప్రతి నెల నిర్వహించే హోమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది ఉదయాన్నే వేద పండితుల ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు పూర్ణాహుతి కార్యక్రమంతో హోమం పూర్తి అయింది ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాములపాడు శ్రీ వివేకానంద హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు దసరా వేడుకలు

నవదుర్గ వేషాధారంలో విద్యార్థుల అద్భుత అభినయం:-ఆర్ఎస్ఆర్. గోపాల్(శ్రీ వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్)



పాములపాడు అక్టోబర్-10 రిపబ్లిక్ న్యూస్:- నంద్యాల జిల్లా పాములపాడులోని, శ్రీ వివేకానంద హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్.గోపాల్ ఆధ్వర్యంలో ముందస్తు దసరా వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నవదుర్గల రూపాల్లో ప్రత్యేక వేషధారణలతో అలరించడంతో పాటు, అమ్మవారి వివిధ అవతారాల విశిష్టతను తమ అద్భుతమైన అభినయంతో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.నవరాత్రుల ఆధ్యాత్మిక విశిష్టతను, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ సందేశాన్ని విద్యార్థులు చక్కగా వివరించారు. ముఖ్యంగా దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించే ఘట్టాన్ని మహిషాసురమర్దిని వేషధారణలో విద్యార్థులు అద్భుతంగా అభినయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే దసరా పండుగలో విశిష్ట స్థానం కలిగిన శమీ వృక్ష పూజ ప్రాముఖ్యతను, శమీ ఆకులను పరస్పరం పంచుకోవడంలోని స్నేహభావం, శుభాకాంక్షలు, సౌభ్రాతృత్వ సందేశాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించే ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది. పండుగలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ధర్మం, ధైర్యం, న్యాయం, సత్యం, స్త్రీశక్తి గొప్పతనాన్ని చాటిచెప్పే జీవన సందేశాలని ఈ వేడుకలు చాటిచెప్పాయి.చెడుపై మంచి విజయం సాధించినప్పుడే నిజమైన విజయదశమి. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం వంటి దుర్గుణాలను జయించి, సత్యం, ధర్మం, ప్రేమ, సేవాభావంతో ముందుకు సాగడమే దసరా పండుగ అందించే గొప్ప సందేశం అనే భావనను విద్యార్థుల అభినయాలు ప్రతిబింబించాయి.ఈ సందర్భంగా ప్రత్యేక వేషధారణలతో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్.గోపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విజయదశమి మనకు నేర్పేది ఒక్కటే చెడును జయించే శక్తి మనలోనే ఉంది. జ్ఞానాన్ని ఆయుధంగా, ధర్మాన్ని మార్గంగా, మంచితనాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రతి విద్యార్థి జీవితంలో విజయాలను సాధించాలి విజయదశమి సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాయపాటి దేవిక. అడ్మినిస్ట్రేటర్ బాలకృష్ణమ్మ. కల్చర్ ఇన్ ఛార్జి షాజహాన్. ఉపాధ్యాయులు గాయత్రి, జయలక్ష్మి, పుష్పలత, మల్లికా, దీపిక, సురేంద్ర, తిరుమలేష్, చంద్రకళ, ననీమా, స్రవంతి, రాణి, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను విడిపించండి.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.



రైల్వే కోడూరు అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్.

ఓబులవారిపల్లి మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో అయ్యలరాజు పల్లి వద్ద ప్రయాణికులకు నీడనిచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూమిని అగ్రకులాల వారు ఆక్రమించుకొని, ఆర్ అండ్ బి స్థలంలో ఉన్న ప్రభుత్వ చెట్లను సైతం ఆక్రమించుకొన్నారని చెట్లకు రక్షణ కరువైందని అయ్యలరాజు పల్లి ప్రజలు వాపోతున్నారు, విపరీతమైన ఎండలకు ప్రయాణికులు ఆ చెట్ల కింద నిలిచి ఆటోల్లో, బస్సుల్లో వెళ్లేందుకు ఆ చెట్ల కింద నిలుస్తారని ఇక్కడ నిలవడానికి వీలులేదని ఆక్రమణదారులు దౌర్జన్యం చేస్తున్నారని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు, అలాగే పాములేరు బ్రిడ్జి నుండి అయ్యలరాజు పల్లి వరకు ఆర్ అండ్ బి రోడ్డు, రెవెన్యూ స్థలాలను ఆక్రమించడంతో ప్రధాన కేంద్రానికి వెళ్లే విద్యుత్ సరఫరా లైనులకు అంతరాయం కలిగేలా ఉంది, అయ్యలరాజు పల్లి హరిజనవాడ వద్ద రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1890/ఎ లో 36 సెంట్లు, ఆర్ అండ్ బి రోడ్డుకు సంబంధించిన సర్వేనెంబర్ 2656 లో 5 సెంట్లు మొత్తం 41 సెంట్లు భూమిని అలాగే ఆర్ అండ్ బి వారు నాటిన నీడనిచ్చే భారీ ఎత్తు వృక్షాలను ఆక్రమించడం జరిగింది. అదేవిధంగా తారు రోడ్డు వరకు ముళ్ల తంతితో ఫెన్సింగ్ వేసి ఆక్రమించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు అన్నారు, ఆర్ అండ్ బి స్థలంలో బోరును సైతం వేసుకోవడం జరిగిందని

దీనిపై పలుమార్లు ఆర్ అండ్ బి అధికారులకు, రెవెన్యూ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో అధికారులపై తీవ్ర ఎత్తున విమర్శలు చేస్తున్నారు,ప్రస్తుతం విద్యుత్ సరఫరా లైన్లో కోసం నూతన స్తంభాలు ఏర్పాటు చేసే క్రమంలో వారి ఆక్రమణ స్థలంలో నాటరాదని అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వేసుకోవాలని బెదిరించడంతో గత మూడేళ్లుగా పనులు నిలబడి పోయాయి. అదేవిధంగా అయ్యలరాజు పల్లి హరిజనవాడ , అయ్యల రాజు పల్లి గ్రామం, అయ్యల రాజు పల్లి వడ్డేపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు నిలుచుకునేందుకు నీడనిచ్చే వృక్షాన్ని నరక వద్దని విన్నవించడంతో విద్యుత్ శాఖ అధికారులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పనులు నిలిచిపోతున్నాయి. దీనిపై రెవెన్యూ శాఖ, ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని భూమిని ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని గ్రామస్తులు హెచ్చరికలు చేశారు.

బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్యే విరుపాక్షికి

ఆలూరులో ఘన స్వాగతం

అడుగడుగునా నీరాజనం పలికిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు







ఆలూరు అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్)

బెయిల్‌పై విడుదలైన ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షికి నియోజకవర్గంలో ఘన స్వాగతం లభించింది. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాకతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని, సంఘీభావాన్ని చాటుకున్నారు. అడుగడుగునా నీరాజనం పలుకుతూ తమ నాయకుడికి అండగా నిలిచారు.ఎమ్మెల్యే విరుపాక్షి విడుదలతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, అరెస్టుల ద్వారా వైఎస్సార్‌సీపీని రాజకీయంగా అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. అయితే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడి పోరాడే తమ పార్టీని భయపెట్టడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకోవడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని పార్టీ శ్రేణులు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. ప్రతిపక్షం చేసే విమర్శలను, ప్రజా సమస్యలపై లేవనెత్తే ప్రశ్నలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే విషయంలో చట్టం నిష్పక్షపాతంగా అమలు కావాలని, రాజకీయ విభేదాలకు అతీతంగా న్యాయ ప్రక్రియ కొనసాగాలని పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే విరుపాక్షి అరెస్టు వ్యవహారంపై కూటమి ప్రభుత్వ తీరును విమర్శిస్తూ, రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ప్రతిపక్ష గొంతును నొక్కలేరని అన్నారు. తమ నాయకుడికి ఎదురైన పరిస్థితులు పార్టీ శ్రేణులను మరింత ఐక్యంగా నిలబెట్టాయని పేర్కొన్నారు.ఆలూరు నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.ఎమ్మెల్యే విరుపాక్షికి ఆలూరులో లభించిన స్వాగతం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తమ నాయకుడికి అండగా నిలుస్తామని, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ పరిణామంతో ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ రాజకీయ కార్యకలాపాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

నూతనంగా ఎన్నికైనా ఇటిక్యాల్ సేవా సమితి అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలువాగా జీవన్ రెడ్డి తెలిపిన శుభాకాంక్షలు

రాయికల్ మండలం అక్టోబర్ 10(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సేవ సమితి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ప్రతాపు రెడ్డి , ఉపాధ్యక్షులు శ్రీనివాస్ , కోశాధికారి రాజు కుమార్ మరియు కమిటీ సభ్యులను మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఘనంగా శాలువతో సన్మానించి, శుభాకాంక్షలతో పాటు అభినందనలు తెలిపారు.

వారి వెంట. నాయకులు అది రెడ్డి , విష్ణు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ...

రైతాంగానికి తోడు నిలిచిన రైతు బిడ్డ కేసీఆర్

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లో అతిపెద్ద గ్రామం ఇటిక్యాల్ రాబోయే సంవత్సర కాలం ఇటిక్యాల గ్రామం అభివృద్ధి పదంగా మాడల్ స్కూల్ అన్ని విధాల కూడా అభివృద్ధికి సంకేతంగా జూనియర్ కళాశాల ఏర్పాటు కానీ రాయికల్ మండల ఇటిక్యాల్ గ్రామస్తులు అందరు కూడా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా నిలబడి అభివృద్ధికి తోడ్పడుతున్నటువంటి విషయం మన అందరికీ తెలిసిందే భవిష్యత్తులో కూడా రాయికల్ మండల కేంద్రం రాయికల్ అభివృద్ధితో పాటుగా ఇటిక్యాల్ గ్రామ అభివృద్ధి కొరకు కావలిసిన మౌలిక సదుపాయాలు కల్పింప చేయడం లోపల నాకున్న అనుభవంతోని బిఆర్ఎస్ పార్టీ పక్షాన గ్రామ అభివృద్ధి కొరకు తోడు నిలవడం జరుగుతుంది

ఎల్ నినో ప్రభావంతోని రాష్ట్రంలో అద్వర్స్ సీజనల్ కండిషన్స్ దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడడం దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది



మనకు కావలసిన సాగునీరు కల్పింపచేయడానికి దిగువ ప్రాణహిత నది జలాలు నిరంతా వృధా పోతున్నా కానీ వాటి ఎగువకు తరలించకుండా ఎస్సారెస్పీలో 40 టిఎంసి నీరు మనకున్నది ఇంకో 30 టిఎంసి సమర్పించినట్టయితే 80 టీఎంసీ తోని ఖరీఫ్ పంట రబి పంటకు కూడా దోహదపడుతుంది దానికి విద్యుత్ కూడా గత ప్రభుత్వ హయాంలో కెసిఆర్ వారి విజన్ ను అభిసెట్ చేయాలి

దేశంలో ఎక్కడ లేని విదంగా తెలంగాణ రాష్ట్రం లో వ్యవసాయ రంగాన 24 గంటల ఉచిత విద్యుత్ కల్పింప చేసి రైతాంగానికి తోడు నిలిచిన అటువంటి రైతు బిడ్డ కేసీఆర్ సాగునీరు విద్యుత్ తో పాటుగా పెట్టుబడి సహాయం చేయడానికి రైతు బంధ్ కార్యక్రమం చేపట్టబడడం జరిగింది ఎవరు అయిన ఆపదలో మరణించినట్టు అయితే ఆదుకోవడానికి ఎక్కడ లేని విదంగా రైతు బీమా పథకం అమలు చేయడం జరిగింది పండించిన పంటలకు మద్దతు ధర కల్పన ఈ విదంగా కేసీఆర్ స్వయంగా ఒక రైతు బిడ్డగా తెలియజెప్పే విదంగా ఈ కార్యక్రమాలు అమలు చేయడం జరిగింది

ప్రస్తుత ప్రభుత్వం రేవంత్ రెడ్డి కేవలం గత ప్రభుత్వం మీద ఈర్ష ద్వేషాల తోని మన ప్రాంతానికి నీరు కల్పింప చేసే అవకాశం ఉన్న కూడా ఆయన నిర్లక్ష్యంతో ఇబ్బంది ఎదుర్కోవడం జరుగుతుంది ఎస్ఆర్ఎస్ పి నీరు రెండు తడులు ఇచ్చినట్టు అయితే పంటలు అన్ని కూడా కాపాడ కలుగుతాయి ఒకొక్క వెట్టింగ్ 3 టీఎంసీ పెట్టుకున్న 6 టీఎంసీ అయితే 2 పంటలు 2 తడుల తోని ఖరీఫ్ పంట చేతుకు వస్తాయి తదుపరి కన్నెపల్లి పుంపు హౌస్ నుండి రెండో పంటకు కూడా నీరు వచ్చే అవకాశం ఉంది ఆ విదంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడం తో పాటు దానితో విద్యుత్ కూడా గతంలో 24 గంటలు అందిశేప చేసిన ప్రభుత్వం పార్టీ కేసీఆర్ అయితే ఇప్పుడు అసలు విద్యుత్ ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు 6 గంటలు కూడా నిరంతరంగా రావడం లేదు ఎప్పుడు పోతుందో ఎవరికి తెలియడం లేదు కనీసం 12 గంటలు ఇచ్చిన రైతుకు ఉపయోగంగా ఉంటుంది కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గారు ఉత్తమ్ కుమార్ రెడ్డి ని నిన్న కలిశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విజ్ఞప్తి మేరకు నీటి విడుదలకు సానుకూలంగా స్పందించారు అది తక్షణమే అమలుకు రావాలని డిమాండ్ చేస్తున్నాం

భక్తులతో పోటెత్తిన శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామి

స్వామీ వారినీ దర్శించుకున్న కమిషనర్

జై హనుమాన్, జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించిన భక్తులు

బండి ఆత్మకూరు, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలం, పెద్దదేవలాపురం గ్రామ శివారులో వెలసిన ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శనివారం అమావాస్య పర్వదినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని అక్కడ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ సుగాలీ చిన్న రాముడు విజయవాడ వారు అభయ ఆంజనేయ



స్వామివారినీ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఆయన ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు ఆలయ కార్యనిర్వాహకులు శివరాజు నాయక్ తో కలిసి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అలాగే భక్తులు స్వామి వారికి ప్రదక్షణలు చేసి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు జై హనుమాన్, జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆలయ పరిధిలో భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు వసతి సదుపాయాలు కల్పించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివారికి సమర్పించే ప్రత్యేక మంగళ హారతి ఇక్కడ ప్రత్యేకం. ఇందుకోసం భక్తులు జాగారం చేస్తూ వేచి ఉన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంతం పండుగ వాతావరణం నెలకొంది.

50 ఏళ్ల నిరీక్షణకు తెర

30 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ.









రైల్వే కోడూరు అక్టోబర్ 10 రిపబ్లిక్ న్యూస్.

ఓబులవారిపల్లె మండలం కొర్లకుంట గ్రామంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించిందని, కొర్లకుంట గ్రామస్తుల 50 సంవత్సరాల నిరీక్షణకు తెరపడిందని రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు అన్నారు, సరైన రహదారికోసం ఎదురుచూస్తున్న కొర్లకుంట గ్రామ ప్రజల కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయని రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులువారిపల్లి మండలం కొర్లకుంట పంచాయతీలో సుమారు 50 ఏళ్ల తర్వాత తొలిసారిగా రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్,నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి శనివారం భూమిపూజ చేశారు, అర్ధ శతాబ్దపు ఎదురుచూపులకు అభివృద్ధికి రూపం తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తున్నదని,

ఏళ్ల తరబడి రహదారుల ఇబ్బందులతో సతమతమవుతున్న గ్రామ ప్రజలకు ఈ రోడ్ల నిర్మాణం ఎంతో ఊరటనిస్తుందన్నారు,దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ముందుకొచ్చిన నాయకులకు ప్రజలు శాలువలు కప్పి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు,ఆత్మీయ అభినందనలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు,పల్లె ప్రగతే లక్ష్యంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమం కొర్లకుంటలో నూతన ఆశలకు నాంది పలికిందన్నారు,సుమారు 50 ఏళ్ల నిరీక్షణకు తెరదించి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొందని,కొర్లకుంట ప్రజల దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ, ఈ అభివృద్ధి కార్యక్రమం గ్రామ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోనుందన్నారు,ఈ

కార్యక్రమం లో టిడిపి సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, వాసుదేవ రెడ్డి, వై కోట బాలాజీ, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, ఉమ్మల రాజు సుబ్బరాజు, పంచాయతీరాజ్ ఏఈ ఆంజనేయ ప్రసాద్,అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, రాష్ట్ర దళిత నాయకుడు జయరాజ్, మైనారిటీ నాయకుడు జమీర్ అక్బర్ బాషా,అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

సూరి, ప్రేమ్ జ్ఞాపకార్థం పోటీలు

గుత్తి అక్టోబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)

గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం గౌతమీపురి ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో సూరిప్రేమ్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఫుట్‌బాల్ క్రీడాకారులైన సూరి, ప్రేమ్ జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే ఏఓఎం మీనా, గుత్తి పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ఆసుపత్రి కమిటీ సభ్యుడు ఎర్రగుడి రమేష్, యువనాయకుడు రాజా, చెరుకూరి



లక్ష్మణ్, పోతుల అరవింద్ యాదవ్ హాజరయ్యారు. వారు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నవారే నిజమైన విజేతలని అన్నారు. సూరి, ప్రేమ్ జ్ఞాపకార్థం వారి స్నేహితులు టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వారి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని క్రీడా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫుట్‌బాల్ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్, రాజా, చాంద్ బాషా, కోచ్‌లు ఇదురు బాషా, విజయ్, మగీ క్రీడాకారులు పాల్గొన్నారు.

మైతాపూర్ కొడిమ్యాల సుజిత్ కుమార్కు

60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందచేసిన మాజీ ఎంపీటీసీ గోపిరాజ రెడ్డి

రాయికల్ మండలం అక్టోబర్,10(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామములో కొడిమ్యాల సుజిత్ కుమార్ కి ఆరోగ్యం బాగా లేనందున చికిత్స చేయించు కొని హాస్పిటల్ బిల్లుల కొరకు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆశ్రయించగా వారి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తు చేయగా అట్టి చికిత్స ఖర్చు ల నిమిత్తం సుజిత్ కుమార్ కు మంజూరు అయిన అరువది వేల రూపాయల మంజూరు అయిన సహాయ నిధి చెక్కును మాజీ ఎంపీటీసీ సభ్యులు గోపి రాజారెడ్డి అందచేశారుఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారుఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ గోపి రాజారెడ్డి స్థానిక వార్డ్ సభ్యులు బుస గంగ మల్లయ్య రాయికల్ పట్టణ ఆర్య సంఘం అధ్యక్షులు గంప ఆనందం కొడిమ్యాల శ్రీనివాస్ అంజి తదితరులు పాల్గొన్నారు

ఇటిక్యాల గ్రామ సేవా సమితి నూతనంగా ఎన్నికైన అభివృద్ధి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన దావసంత సురేష్





రాయికల్ మండలం అక్టోబర్10 (రిపబ్లిక్ న్యూస్)జగిత్యాల జిల్లా,రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ సేవ సమితి అభివృద్ధినూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు ప్రతాపు రెడ్డి ఉపాధ్యక్షులు రొట్టె శ్రీనివాస్ కోశాధికారి రాజు కుమార్ మరియు కమిటీ సభ్యులు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ని మర్యాదపూర్వకంగా కాలువగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు

నిరుపేదలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో12 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు





రాయికల్ మండలం అక్టోబర్10 (రిపబ్లిక్ న్యూస్)జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆసుపత్రిలో రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 12 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారుఈ సేవా కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని నిరుపేదలకు కంటి శస్త్రచికిత్సలు చేసారు.అనంతరం శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, అవసరమైన మందులను పంపిణీ చేశారు. నిరుపేదలకు కంటి చూపును అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, రోటరీ క్లబ్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగూడూరు వంశీకృష్ణ నాయక్ అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

:- సీఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి



పాములపాడు అక్టోబర్-10 రిపబ్లిక్ న్యూస్:-మండల కేంద్రమైన పాములపాడులోని, ఎన్ హెచ్ 340సి పై స్కూటీ పై వెళుతున్న ఎర్రగూడూరు గ్రామానికి చెందిన రత్నావత్ వంశీకృష్ణ నాయక్ (26) డివైడర్ల మధ్యన నిన్న రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందడం జరిగిందని సిఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎంవి.రమణ లు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు రూరల్ సిఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎం.వి.రమణ లు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారము రత్నావత్ వంశీకృష్ణ నిన్న రాత్రి నుండి కనబడుటలేదని వెతుకుతున్నామని, ఈరోజు పాములపాడు గ్రామం వద్ద నేషనల్ హైవే డివైడర్ల మధ్యన ఒక శవం ఉన్నట్లు స్థానికులు చెప్పగా అక్కడికి వెళ్ళమని, అది వంశీకృష్ణ డెడ్ బాడీ గా గుర్తించడం జరిగిందన్నారు. ఈ విషయం పోలీసులకు తెలుపగా, వారు సంఘటనా స్థలానికి వచ్చి ఆ పరిసరాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులు వంశీకృష్ణ మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, డెడ్ బాడీని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా కొరకు పంపడం జరిగిందన్నారు. పూర్తి వివరాలు విచారణలో బయటికి వస్తాయని తెలిపారు. సీఐ తోపాటు హెడ్ కానిస్టేబుల్ ఏం.షేక్షావలి, తదితర కానిస్టేబుళ్లు వలి, నాయక్, తదితర కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు మద్దతుగా మృణాల్



బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్‌లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు. కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు."ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. వారి కృషిని, విజయాన్ని మరిచిపోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్రమే ఎక్కువగా విమర్శించేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటించిన జువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

రజినీకాంత్ 'జైలర్ 2' టిక్కెట్ రేట్ల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా అనుమతి
సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. దసరా పండుగ కానుకగా అక్టోబరు 15న ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో, తొలి వారం రోజుల పాటు పెంచిన ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంటూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై గరిష్ఠంగా రూ. 50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ. 75 (జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ పెరిగిన ధరలు సినిమా విడుదలైన అక్టోబరు 15 నుంచి అక్టోబరు 21 వరకు, అంటే వారం రోజుల పాటు వర్తిస్తాయి. దీనితో పాటు, తొలి వారం రోజుల్లో ప్రతిరోజూ ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా ప్రభుత్వం థియేటర్ యాజమాన్యాలకు అనుమతి ఇచ్చింది.



'ధురంధర్' మరో ఘనత..
గ్రామీ అవార్డుల బరిలో సౌండ్ ట్రాక్



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్', 'ధురంధర్-2' సినిమాలు ఏ రేంజ్‌లో సక్సెస్ సాధించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదిత్య ధర్ తెరకెక్కించిన ఈ రెండు సినిమాలను ప్రేక్షకులకు విశేషంగా ఆదరించారు. ఒటిటిలోనూ ఈ సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే 'ధురంధర్-2: ది రివేంజ్' సినిమా మరో ఘనతను సాధించింది. ఈ సినిమా ఆల్బమ్ 2027 గ్రామీ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తం 8 విభాగాల్లో అవార్డుల పరిశీలనకు పంపినట్లు నిర్మాణ సంస్థ 'బి62 స్టూడియోస్' అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. విజువల్ మీడియాకు సంబంధించి సౌండ్‌ట్రాక్‌గా 'ధురంధర్' ఆల్బమ్‌ని పోటీకి పంపారు. అలాగే పలు పాటలను వేర్వేరు విభాగాల్లో గ్రామీ పరిశీలనకు పంపించారు.

'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్



టాలీవుడ్‌లో కాజల్ అగర్వాల్ అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ హీరోయిన్‌గానే వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. పెళ్లయి బాబు పుట్టిన తర్వాత కూడా తన సినిమాల ఎంపిక విషయంలో తేడా చూపించకుండా కమర్షియల్ పాత్రలను చేయడం చూడవచ్చు. ప్రస్తుతం కాజల్ 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కనిపించబోతోంది. కెరీర్ చివరి దశలో ఉందని భావిస్తున్న సమయంలో రణబీర్ కపూర్, సాయి పల్లవిలు రాముడు, సీత పాత్రలో నటిస్తున్న రామాయణ సినిమాలో కాజల్ అగర్వాల్ కి రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ కి భార్య పాత్రలో నటించే అవకాశం దక్కింది. కచ్చితంగా మండోదరి పాత్రతో కాజల్ మరో నాలుగు, అయిదు ఏళ్లు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి 'రామాయణ 1' సినిమా రాబోతుంది. వచ్చే ఏడాదిలో 'రామాయణ 2' రానుంది.

'రణబాలి' ట్రైలర్‌పై చిత్ర బృందాన్ని ప్రశంసించిన మంత్రి లోకేశ్

థ్యాంక్స్ లోకేశ్ అన్నా..
సీమ గడ్డ గర్వపడే సినిమా ఇది: విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రష్మిక మందానా జంటగా నటిస్తున్న 'రణబాలి' సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. దీనిపై హీరో విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, ఈ సినిమా ద్వారా రాయలసీమ గడ్డకు తాను రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌ను వీక్షించిన మంత్రి లోకేశ్ చిత్ర బృందాన్ని అభినందించారు. రాయలసీమ చారిత్రక పోరాటాన్ని, బ్రిటిష్ పాలకుల అణచివేతను అద్భుతంగా ఆవిష్కరించారని ఆయన కొనియాడారు.లోకేశ్ ప్రశంసలపై విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "లోకేశ్ అన్నా.. రాయలసీమ నేల నాకు ఎంతో ఇచ్చింది. ఈ గడ్డకు నేను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, రుణం ఈ సినిమా రూపంలో నెరవేరుతోంది. మీ సందేశం మా చిత్ర యూనిట్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. మన నేల గొప్పతనాన్ని, మన ప్రజల ఆత్మగౌరవాన్ని చూసి ప్రతి ఒక్కరి గుండె గర్వంతో ఉప్పొంగేలా ఈ చిత్రం ఉంటుంది. వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతి మీకోసం వేచి చూస్తోంది" అంటూ లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు..
800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!



ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కంపెనీలోని మొత్తం సిబ్బందిలో సుమారు 5 శాతం మందిని, అంటే దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనికి సంబంధించిన ప్రకటన వచ్చే వారంలోనే ఉండవచ్చని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ పలు నివేదికలు పేర్కొంటున్నాయి.2025 చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఫుల్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 68 శాతం మంది అమెరికా, కెనడాలోనే పనిచేస్తున్నారు. తాజా తొలగింపులు కార్యరూపం దాల్చితే, 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత కానుంది. ఆ సమయంలో కూడా వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్లు తాత్కాలికంగా తగ్గడంతో వందలాది మందిని కంపెనీ తొలగించింది. ప్రస్తుతం వినిపిస్తున్న వదంతులపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది.అయితే, ఏయే విభాగాలపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఫీచర్ ఫిల్మ్‌లపై పనిచేస్తున్న క్రియేటివ్ టీమ్‌లలో కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, మీడియా సంస్థల విలీనాలు, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు వీక్షకులను, ప్రకటనల ఆదాయాన్ని ఎక్కువగా ఆకర్షిస్తుండటం నెట్‌ఫ్లిక్స్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. కేవలం సబ్‌స్క్రిప్షన్‌లపై ఆధారపడకుండా, ప్రకటనలతో కూడిన ప్లాన్‌లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ వంటి కొత్త రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల ఒక సదస్సులో మాట్లాడిన కంపెనీ కో-సీఈఓ టెడ్ సారండోస్, తాము వృద్ధి చెందుతున్నప్పటికీ, నాయకత్వం ఆశించిన స్థాయిలో వేగంగా వృద్ధి సాధించలేకపోతున్నామని అంగీకరించారు.ఆర్థికంగా చూస్తే.. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ 12.56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 13 శాతం అధికం. అయినప్పటికీ, 2026 పూర్తి సంవత్సరానికి గాను ఆదాయ అంచనాలను తగ్గించడం, గత ఏడాదిగా కంపెనీ షేరు ధర గణనీయంగా క్షీణించడం వంటి పరిణామాలు పెట్టుబడిదారులలో ఆందోళన కలిగిస్తున్నాయి. అక్టోబర్ 20న కంపెనీ తదుపరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పునర్‌వ్యవస్థీకరణ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్.. మద్దతుగా కంగనా



టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని స్పష్టం చేశారు. కమల్ వ్యాఖ్యలకు నటి, ఎంపీ కంగనా రనౌత్ మద్దతు తెలిపారు.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, భారత ప్రధాని అంబానీనా? అంటూ సెటైరిక్ గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. "ఏ బిలియనీర్ అయినా, అది భారతీయ అయినా, అమెరికన్ అయినా... దేశ విధానాలను నిర్దేశించలేరు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ విమర్శించారు. "చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోంది. భారత్ కూడా అదే విధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోంది" అని వివరించారు.

"భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం, వలస పాలిత ప్రాంతం (కాలనీ) కాదు. మేము ప్రపంచాన్ని స్వాగతిస్తాం. కానీ మా భవిష్యత్తును భారత ప్రజలమే నిర్ణయించుకుంటాం" అని కమల్ హాసన్ తన పోస్టులో తేల్చిచెప్పారు.

కమల్ పోస్టును రీషేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. "ఇది మస్క్‌కు బాగా తగిలి ఉంటుంది. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదు. కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారు" అంటూ ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసిన విషయం తెలిసిందే.